## క్లుప్తంగా

### పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నరసింహ, సభ్యులు

మోతీనగర్: నూతన సంవత్సరం సందర్భంగా ధరిత్రి ఫౌండేషన్ ద్వారా పేదలకు దుప్పట్లు, అనాథలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. మూసాపేట, బాలానగర్, బోయినపల్లి, కొంపల్లి, సికింద్రాబాద్, ముషీరాబాద్, అమీర్‌పేట్ ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వైస్ చైర్మన్ నరసింహ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సభ్యులు, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



బిల్వ పత్రి మొక్కను నాటేందుకు తీసుకెళ్తున్న వెంకటేశ్వరరావు దంపతులు

కూకట్‌పల్లి: ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో ఎలక్ట్రికల్ ఉద్యోగ సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు సతీ సమేతంగా బిల్వ పత్రి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### ఘనంగా జానకి రామరాజు జన్మదిన వేడుకలు



జానకి రామరాజుచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ బీజేపీ నాయకులు జానకి రామరాజు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. హెచ్‌ఎంటీ శాతవాహననగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో డివిజన్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

### ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు ఆటల పోటీలు

మియాపూర్: ఆర్టీసీ డిపో-1లో ఫార్మేషన్ డే సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎం రామయ్య హాజరై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేసి అభినందించారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 44 మందిపై కేసు

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదయ్యాయి. పటాన్‌చెరు పట్టణం, మండలంలో మూడు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శనివారం అర్ధరాత్రి మద్యం తాగి పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

## క్రైం కార్నర్..

### డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లిన యువకుడి అదృశ్యం



దివాకర్

కుత్బుల్లాపూర్: ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లి మజీద్ గల్లీలోని నివాసముండే సెక్యూరిటీ నాగూర్‌వర్ పవికార్ కుమారుడు దికవార్(25) ప్రైవేట్ ఉద్యోగి. కాగా డిసెంబర్ 30 తేదీ సాయంత్రం 6 గంటలకు పవికార్‌కు చెందిన బ్యాంక్ ఏటీఎం కార్డులో బ్యాలెన్స్ చెక్ చేస్తానని స్థానికంగా కొంపల్లి కమాన్ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎమ్ సెంటర్‌కు వెళ్లాడు. అయితే రాత్రి 8 గంటలైనా ఇంటికి తిరిగి రాకపోయేసరికి ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఏటీఎం వద్ద, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో దివాకర్ కోసం వెతకగా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం పవికార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనమైన.. వీడ్కోలు వెల్‌కమ్



రెయిన్‌బో విస్టాస్ ఫేజ్-2లో నిర్వహించిన వేడుకల్లో..



గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో..

## ఆటపాటలతో 2022కు బైబై.. భక్తిశ్రద్ధలతో 2023కి హాయ్..హాయ్..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పరిధిలోని సందడిగా థర్టీఫస్ట్, న్యూఇయర్ వేడుకలు
- థర్టీఫస్ట్‌తో ఆటపాటలతో ఆనందాల నడుమ మధుర స్మృతుల నెమరు
- న్యూఇయర్‌లో అంతా మంచి జరగాలని భక్తిశ్రద్ధలతో మొక్కులు



నిజాంపేట్: న్యూఇయర్ సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో అనాథలకు బట్టలు పంపిణీ చేస్తున్న బీజేపీ మైనార్టీ మోర్చా నాయకురాలు అమలేశ్వరి

కుత్బుల్లాపూర్ : నూతన సంవత్సరం-2023 సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. 2022 చివరి రోజైన డిసెంబర్ 31వ తేదీ శనివారం చిన్నారులు, యువత, పెద్దలు, మహిళలు ముఖ్యంగా స్నేహితులు ఒకచోట చేరి డీజే పాటలతో నృత్యాలు, వివిధ సంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు జరుపుకుని సందడిగా గడిచి గతేడాదికి ఘనమైన వీడ్కోలు పలికారు. అనంతరం కేకులు కట్ చేసి బాణాసంచాలు పేల్చి న్యూఇయర్‌కు కలర్‌ఫుల్‌గా స్వాగతం పలికారు.

**వాకిళ్లు కలర్‌ఫుల్..**

2023 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలు తమ తమ ఇళ్ల ముందు వాకిళ్లలో వివిధ రకాల కలర్లతో రంగవల్లులను పోటాపోటీగా వేశారు. ఆదివారం ఉదయం 12.30 గంటల నుంచే కొందరు మహిళలు రంగవల్లులు వేయడం ప్రారంభించి పూర్తి చేయగా మరికొందరు ఉదయాన్నే లేచి సుమారు 8 గంటల వరకు తమ వాకిళ్లను అందంగా తీర్చిదిద్దారు.

**ఆలయాలు కిటకిట...**

2023 ఆదివారం 1వ తేదీ ఉదయాన్నే లేచి స్నానాలు ఆచరించి దేవాలయాలకు కుటుంబ సమేతంగా క్యూ కట్టారు. ఈ ఏడాది అంతా మంచి జరగాలని తమతమ ఇష్ట దేవతలకు మొక్కులు చెల్లించుకుని తమ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రువులకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా పలు కాలనీ, బస్తీల అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేలకు, కార్పొరేటర్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరమంతా ప్రజలంతా సంతోషంగా గడపాలని, ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు కోరారు.



నిజాంపేట్: న్యూఇయర్ సందర్భంగా బాచుపల్లి సాయినగర్ చర్చిలో పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న ఫాస్టర్ ప్రభుదాస్, చర్చి అధ్యక్షుడు ఇసాక్, చిట్టిబాబు, చంద్రయ్య, అగస్టీన్, అంకయ్య, జాన్ ప్రకాష్, ప్రకాష్, అబ్బులు, ఆనంద్, దిలీప్ తదితరులు.



సూరారంకాలనీ అగస్టీన్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్యకర్తలు



విశేషాలంకరణలో సూరారం ఉమామహేశ్వరుడు



బీఆర్ఎస్ సీనియర్ నేత కేఎం ప్రతాప్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

## ఘనంగా కార్పొరేటర్ సత్యనారాయణ పుట్టిన రోజు



బీఆర్ఎస్ నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

కుత్బుల్లాపూర్: సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సంజయ్‌గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి సత్యనారాయణతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, నియోజవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సోమేశ్‌యాదవ్, డివిజన్ల అధ్యక్షులు పుప్పల భాస్కర్, రుద్ర అశోక్, పోలె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీలోని రోడ్డు నంబర్.5లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను అధికారులు ఎట్టకేలకు సరి చేశారు. స్థానికంగా మ్యాన్ హోల్ ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయమై డిసెంబర్ 31న 'ధ్వంసమైన మ్యాన్ హోల్' అనే శీర్షికతో సాక్షి కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి మూతను ఏర్పాటు చేశారు.

## సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



ఆదర్శనగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాల సభ్యులు ఐక్యతతో అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఆదర్శ్‌నగర్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అరవ శంకరయ్య, వైస్ ప్రెసిడెంట్ దుర్గ, సెక్రెటరీ ఆంజనేయులు, ట్రెజరర్ నాగభూషణం, కె.శ్రీనివాస్, శివలాల్, నారాయణ, ఇస్మాయిల్, శ్రీనివాస్, ఫక్రుద్దీన్, రాజ్ కిరణ్, మోహన్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## 'బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ పార్టీ వైఎస్సార్‌టీపీయే'



కండువాలు కప్పి వైఎస్సార్‌టీపీలోకి ఆహ్వానిస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైఎస్సార్ టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, కోఆర్డినేటర్ గోపాల్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, రాబోయే రోజుల్లో ప్రత్యామ్నాయ పార్టీగా వైఎస్సార్ టీపీ ఎదుగుతోందని ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ వద్ద కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన సంపంగి వెంకటేష్, గణేష్, వెంకటేష్, నరసింహారెడ్డి, అర్చన, దయామని, రూప, తులసి, జోన, ఆలం, ఉత్తం, విజయ్ కుమార్ తదితరులు వైఎస్సార్ టీపీలో చేరారు. వీరికి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేష్ రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వైఎస్సార్ టీపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని దీమా వ్యక్తం చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఇక్కడ పేదలకు ఇళ్లు ఇచ్చిన ఘనత ఉన్నదని, ఇప్పటి వరకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వని సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## 'థర్టీఫస్ట్.. తాగుబోతులకు ట్విస్ట్'!

- ప్రధాన ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- అల్వాల్, జీడిమెట్ల, బాచుపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పట్టుబడ్డ 233 మంది మద్యం బాబులు



డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు

కుత్బుల్లాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. జీడిమెట్ల, అల్వాల్, బాచుపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 233 కేసులు నమోదు కావడం విశేషం. 2022 డిసెంబర్ 31 వేడుకల నేపథ్యంలో పోలీసులు పలు ప్రధాన ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పెద్ద ఎత్తున మద్యం తాగి వెళ్తున్న వారిని బ్రీత్ అనలైజర్స్‌తో చెక్ చేసి పట్టుకున్నారు. జీడిమెట్ల సీఐ చంద్రశేఖర్, అల్వాల్ సీఐ రాజు, బాచుపల్లి సీఐ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు.

**మూడు ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో ఇలా...**

- అల్వాల్ ట్రాఫిక్ పీఎస్ పరిధి జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డు, సుచిత్ర చౌరస్తా, అల్వాల్‌కు వెళ్లే లయోలా కాలేజీ రోడ్డు, కానాజీ గూడ, రాజరాజేశ్వరి టెంపుల్, కొంపల్లి ప్రధాన చౌరస్తా ఇలా ఆరు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టగా మొత్తం 108 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.
- జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐడీపీఎల్ చౌరస్తా, చింతల్ ప్రధాన రోడ్డు, గాజులరామారం, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఆఫీస్, దేవేందర్‌నగర్, సూరారం, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ చౌరస్తాలో ఇలా తొమ్మిది ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టగా 60 మంది పట్టుబడినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.
- బాచుపల్లి పీఎస్ పరిధిలో సీఐ నరసింహారెడ్డి నేతృత్వంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 65 మంది వాహనదారులు మద్యం సేవించి పట్టుబడ్డారు.

**హెచ్చరించినా...**

న్యూఇయర్ వేడుకల సందర్భంగా వాహనాలు నడిపే సమయంలో మద్యం తాగరాదని ట్రాఫిక్ పోలీసులు విస్తృత ప్రచారం చేపట్టినా పలువురు మద్యం తాగి వాహనాలు నడపడం విశేషం. కొన్ని ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని అడ్డదారుల్లో తప్పించుకు వెళ్లారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో అక్కడక్కడ తనిఖీలు చేపట్టగా మరికొన్ని చోట్ల ప్రధాన చౌరస్తాల్లో పోలీసులు గస్తీ చేపడుతూ కనిపించారు.

## ఏడాదొచ్చె.. ఏమాయె?!

- ప్రారంభించి సంవత్సరం గడిచినా అందుబాటులోకి రాని భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపం
- సరైన ప్రణాళికలు వేయకుండా పనులు చేపట్టడంతో నిధులు దుర్వినియోగం
- ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సిన దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలు



భగత్‌సింగ్‌నగర్‌లోని మోడ్రన్ ఫంక్షన్ హాల్ భవనం



క్యూరింగ్ చేయకుండా వదిలేసిన ఫంక్షన్ హాల్ గోడ



2022 జనవరి 25న మంత్రి కేటీఆర్ ప్రారంభించిన మోడ్రన్ ఫంక్షన్ హాల్ శిలాఫలకం

చింతల్: పేదల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా కుంటి సాకులతో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు సామాన్య ప్రజలకు అందడం లేదన్నది బహిరంగ సత్యం. మరోవైపు అధికారుల ముందుచూపు లేకపోవడం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తోడై సంక్షేమ కార్యక్రమాలు మరింత దూరమవుతున్నాయి. ఇందులో భాగంగా చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన మోడ్రన్ కల్యాణ మండపం హంగు ఆర్భాటాలతో మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఏడాది కావస్తున్నా నేటికి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. మోడ్రన్ ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రాకపోవడంతో స్థానిక పేద కుటుంబాల వారి వివాహాలు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో జరిపించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీంతో పేద, బడుగు, బలహీన కుటుంబాల వివాహాలు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో జరపడంతో ఆర్థిక కష్టాలు వచ్చి చేరుతున్నాయి.

**ఏడేళ్లుగా నిరీక్షణ...**

డివిజన్‌లో నివసిస్తున్న పేదల కుటుంబాల్లో వివాహాల ఖర్చులో ప్రభుత్వం కొంతైనా ఆర్థిక భారం నుంచి ఘట్టెక్కించాలన్న ఉద్దేశ్యంతో 2015-16లో సుమారు రూ.2 కోట్లతో మోడ్రన్ కల్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఖర్చులు భరించలేక, మామూళ్లు పంచలేక, నిధులు చాలవన్న సాకుతో మధ్యలోనే వదిలేసి పత్తాలేకుండా పోయాడు. దీంతో అధికారులు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించినా ప్రయోజనం లేకపోవడంతో మరో ఇద్దరు కాంట్రాక్టర్లు భవనాన్ని పూర్తి చేసి ఎట్టకేలకు మంత్రి కేటీఆర్‌తో 2022 జనవరి 25వ తేదీన ప్రారంభించి మరో 15 రోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చూడాలంటూ వెళ్లిపోయారు. దీంతో మరో 20 రోజులైతే ఏడాది పూర్తవుతుంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడకపోవడంతో పేదలకు శాపంగా మారింది.

**అంచనాలకు మించి నిధుల వినియోగం...**

2015-16లో భగత్‌సింగ్‌నగర్‌లో నిర్మించిన మోడ్రన్ ఫంక్షన్ హాలు నిర్మాణం పనులకు రూ.2 కోట్లతో శంకుస్థాపన చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లలో పూర్తి కావాల్సిన నిర్మాణం ఆరేళ్లు పూర్తయ్యే సరికి రూ.3,58,32,000 కోట్ల నిధులు ఖర్చు పెట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. కాగా 25 జనవరి 2022న మంత్రి కేటీఆర్ హాజరై ఆఘమేఘాల మీద వచ్చి మోడ్రన్ ఫంక్షన్ హాల్ భవనాన్ని ప్రారంభించారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఫంక్షన్ హాల్‌కు వచ్చే వారికి భోజన సదుపాయాల కోసం, కిచెన్, డైనింగ్ హాల్, మూత్రశాలల నిర్మాణం చేపట్టకుండానే ప్రారంభించడం విశేషం.

**నిధులు దుర్వినియోగం..**

మంత్రి కేటీఆర్ ప్రారంభించిన భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్ హాల్‌కు ఓపెన్ కిచెన్, డైనింగ్ హాలు, టాయిలెట్ల నిర్మాణం, ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టారు. అయినా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

**ప్రణాళిక లేని నిర్మాణాలు..**

మంత్రి కేటీఆర్ ప్రారంభించిన తరువాత రూ.20 లక్షలతో మోడ్రన్ కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ల నిర్మాణానంతరం మరో రూ.30 లక్షలు కేటాయించి మోడ్రన్ ఫంక్షన్ హాల్ ప్రహరీ నిర్మాణం ఎత్తు పెంచేందుకు కేటాయించినట్లు తెలుస్తోంది. మంత్రి కేటీఆర్ ప్రారంభించే నాటికి ప్రహరీ నిర్మాణం చేపట్టినా మరిన్ని నిధులు వెచ్చించి ప్రహరీ ఎత్తు పెంచడంపై తీవ్ర విమర్శలు వినిపించాయి. ఆ సమయంలోనే ఈ గోడ కనిపించ లేదా అంటూ బస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రజాప్రతినిధులు, అధికారుల కోసమే ప్రహరీ ఎత్తు పెంచినట్లు ఆరోపణలు వినిపించాయి. కాగా ఈ గోడ నిర్మాణం పనులను నాసిరకంగా చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా మరో 20 రోజులు గడిస్తే మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఏడాది పూర్తవుతుంది. అప్పటికి ఈ భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్ హాల్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందో.. లేదో.. వేచి చూడాల్సిందే.

## క్లుప్తంగా

### నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి 21 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేయనున్నారని పేర్కొన్నారు.

### 23 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

సుభాష్‌నగర్: శివోహం యోగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 28న రథసప్తమి పురస్కరించుకుని ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహించనునట్లు యోగా గురువు కె.రవీందర్ రాజు తెలిపారు. ఈనెల 23 నుంచి 28 వరకు ఆరు రోజుల పాటు ఉచిత యోగ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. జీడిమెట్ల విలేజ్ లోని 44వ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సరోజిని గార్డెన్‌లో ఉదయం 6 నుంచి 7గంటల వరకు జరిగే ఈ ఉచిత శిబిరంలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం నేర్పించి, వాటి వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తామని సూచించారు. ఆసక్తి గలవారు 93963 78418లో సంప్రదించాలని కోరారు.

### 12మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 12 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. తీవ్రమైన జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో బాధపడుతున్న వారు ముందస్తు జాగ్రత్తగా కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### బాత్‌రూమ్‌లో జారిపడి హెడ్‌కానిస్టేబుల్ మృతి



జగద్గిరిగుట్ట: ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో జారిపడి చికిత్స పొందుతున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. ఒంగోలుకు చెందిన శ్రీమన్నారాయణ కూకట్‌పల్లి విజయనగర్ కాలనీలో నివాసముంటూ గత మూడు సంవత్సరాలుగా జగద్గిరిగుట్ట హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఇంట్లోని బాత్‌రూమ్‌కు వెళ్లిన శ్రీమన్నారాయణ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. అతని తలకు తీవ్ర గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్ రావు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, పిల్లలు రోహిత్, హర్షిత్‌లు ఉన్నారు.

### కంటి వెలుగుకు క్యూ కట్టిన జనాలు



కొంపల్లి కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీహరి

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండోరోజు కంటి వెలుగు కేంద్రాలకు ప్రజలు క్యూ కట్టారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని 5 కేంద్రాల్లో 603 మందికి గాజులరామారం సర్కిల్ పరిధిలోని 4 కేంద్రాల్లో 505 మందికి పరీక్షలు చేశారు. అదే విధంగా నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలో 565 మంది కళ్ల పరీక్షలు చేయించుకున్నారని అధికారులు తెలిపారు. శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో కంటి వెలుగు సెంటర్లు అందుబాటులో ఉండవన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని వైద్యాధికారులు తెలిపారు.

### కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భరోసా



ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులను అందజేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కులాంతర వివాహం చేసుకున్న వారికి (ఐదుగురు దంపతులు) శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఒక్కొక్కరికి రూ.2.5 లక్షల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చెక్కులను అందజేశారు. కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక భరోసా కల్పించడం చాలా సంతోషించదగ్గ విషయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తప్పు చేయాలంటే... వెన్నులో వణుకు పుట్టాలి

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- బాలానగర్ డీసీపీ కార్యాలయంలో క్రైమ్‌రేట్‌పై సమీక్ష
- కొత్త సంవత్సరంలో ఛేదించాల్సిన లక్ష్యాలపై దిశానిర్దేశం
- నేరాల సంఖ్యను తగ్గించేలా పని చేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర



క్రైమ్‌రేట్ సమీక్షకు హాజరైన పోలీసులు

కుత్బుల్లాపూర్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి వారి వెన్నులో వణుకు పుట్టించేలా బేసిక్ పోలీసింగ్ ఉండాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని బాలానగర్ డీసీపీ కార్యాలయంలో బాలానగర్ డీసీపీ జోన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల అధికారులతో సైబరాబాద్ పోలీస్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర క్రైమ్‌రేట్‌పై సమీక్ష సమావేశం నిర్వహించి 2023 సంవత్సరంలో ఛేదించే లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

- ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ... నేరాల సంఖ్యను తగ్గించే విధంగా పోలీస్ సిబ్బంది పని చేయాలన్నారు. ముఖ్యంగా కన్విక్షన్లను తీసుకురావడం, సెక్టార్ల ఎస్సైలు పని తీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సెక్టార్ ఎస్సైలదే కీలకపాత్ర అని.. బాధ్యతాయుతంగా పనిచేస్తూ సరికొత్త స్ట్రాటజీలతో ముందుకు వెళ్లాలన్నారు.
- పెర్ఫార్మెన్స్, ఇండికేటర్ షీట్స్ ద్వారా ఎప్పటికప్పుడు సెక్టార్ ఎస్సైల పనితీరును అంచనా వేస్తామన్నారు. కోర్టు పని, ఎన్‌ఫోర్స్‌మెంట్ పాయింట్స్ బుక్, పోలీసింగ్‌కి సంబంధించిన వివిధ నైపుణ్యాలు, న్యాయ పరిజ్ఞానం, నేర పరిశోధనలో నాణ్యత, టెక్నికల్ నైపుణ్యాలు తదితర అంశాలను పరిగణంలోకి తీసుకుని సెక్టార్ ఎస్సైలకు మార్కులు ఇచ్చి వారి పెర్ఫార్మెన్స్‌ను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.
- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ అంజనికుమార్ నిర్దేశించిన విధంగా 5హెచ్, 5డబ్ల్యూ, టీఐపీ వంటి పద్ధతుల్లో ఇన్వెస్టిగేషన్లలో నాణ్యతను పెంచాలన్నారు.
- ప్రతివారం లాండ్ ఆర్డర్‌పై ఇన్‌స్పెక్టర్లు సమీక్షలు చేయాలని, సాక్షాలను సేకరించడం, సంబంధిత జడ్జీలు, మెజిస్ట్రేట్లతో సంప్రదించి త్వరితగతిన బాధితులకు న్యాయ సేవలు అందించాలన్నారు.
- డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తరచూ ఎస్సైల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు. డీసీపీలు పక్షం రోజులకు ఒకసారి, ఏసీపీలో వారానికి ఒకసారి, ఇన్‌స్పెక్టర్లు, డీఐలు తరచుగా సమీక్షలు నిర్వహించుకుని నేరస్తులకు శిక్షలు పడేలా చూడాలన్నారు.
- సెక్టార్ ఎస్సైల పనితీరుపై తానే స్వయంగా దృష్టి సారిస్తానని.. బాలానగర్ డీసీపీ జోన్ పరిధిలోని చిన్న పెద్ద తరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ ప్రాంతాలు పెట్టుబడులకు ప్రత్యేక ఆకర్షణ ఉన్నందున నేర నియంత్రణ, శాంతి భద్రతలను అదుపులో ఉన్నట్లయితే యువతకు ఉపాధి కల్పన మెరుగు పడుతుందన్నారు.
- 2023 సంవత్సరానికి గాను అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది నేర నియంత్రణలో సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు.విజిబుల్ పోలీసింగ్, ప్రొయాక్టివ్ పోలీసింగ్ పద్ధతులను అవలంభించాలన్నారు.
- గస్తీ వాహనాలు ఎల్లవేళలా రద్దీగా ఉండే ప్రాంతాలు, కూడళ్లలో అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బంది కేసుల ఇన్వెస్టిగేషన్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి వారి వెన్నులో వణుకు పుట్టించేలా పోలీసింగ్ ఉండాలన్నారు.
- పోలీస్ స్టేషన్లో నమోదయ్యే కేసులను చట్ట ప్రకారం నాణ్యమైన పద్ధతులలో దర్యాప్తు చేసి త్వరతగతిన చార్జ్‌షీట్లు వేసి కోర్టులలో దర్యాప్తు అధికారులు సమర్పించాలని, కోర్టు అటెండెన్స్, కన్విక్షన్లు, సాక్షాల సేకరణపై దృష్టి సారించాలన్నారు.
- నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తదనుగుణంగా పాయింట్ పుస్తకాల పునర్వ్యవస్థీకరణ చేయాలన్నారు. క్రిమినల్స్, హిస్టరీ షీటర్స్, రౌడీ షీటర్ల కార్యకలాపాలపై స్థానిక ఎస్‌హెచ్‌ఓలు నిఘా ఉంచి వారు ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా చూడాలన్నారు.
- శాంతి భద్రతలకు భంగం కలగించే వారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు.
- పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులను త్వరితగతిన లోక్ అదాలత్, కన్విక్షన్లు తీసుకురావాలని సూచించారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన ఏదైనా సామగ్రి కావాలన్నా సమాచారం ఇవ్వాలన్నారు.

**ట్రాఫిక్ సమీక్ష... 2023 లక్ష్యాలు**

రోడ్డు ప్రమాదాలను తగ్గేలా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. రూరల్ ప్రాంతాల్లో సైతం డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ల సమయంలో అవసరమైతే లాండ్ ఆర్డర్ సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. అదే విధంగా రోడ్డు ఇంజినీరింగ్ పనులకు సంబంధించి వివిధ స్టేక్ హోల్డర్లతో భాగస్వామ్యం చేసుకుని పని చేయాలన్నారు.

- ఈ సమావేశంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్ నాయక్, క్రైమ్స్ డీసీపీ కల్మేశ్వర్ సింగన్వర్, బాలానగర్ డీసీపీ సందీప్, అడ్మిన్ డీసీపీ ఇందిరా, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, డీఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కానిస్టేబుల్ షరీఫ్ కుటుంబానికి రూ.25లక్షల చెక్కు..





మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.25లక్షల చెక్కు అందజేస్తున్న సీపీ, తదితరులు

శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ షరీఫ్ ఇటీవల విధి నిర్వహణలో ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని భార్యకు సీపీ స్టీఫెన్‌రవీంద్ర, ఏసీపీ రామలింగరాజు, శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ రూ.25 లక్షల చెక్కును అందజేసి డిపార్ట్‌మెంట్ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## ముంపు పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ పనులు



నిజాంపేట్‌లో పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: లోతట్టు ప్రాంతాల్లో ముంపు సమస్యను పరిష్కరించే దిశగా ఎస్ఎన్‌డీపీ పనులు చేపడుతున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం నిజాంపేట్‌లో జరుగుతున్న ఎస్ఎస్‌డీపీ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ నాలా పనులు పూర్తయితే భండారి లేఅవుట్ తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షాకాలంలో తలెత్తే ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ అజీజ్‌ఖాసీం, శానిటరీ ఇన్‌చార్జ్ వినోద్ తదితరులు ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కేంద్రాన్ని ఒప్పించాలి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఉపకులాల నాయకులు

రంగారెడ్డినగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలని ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఉపకులాల నాయకులు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ను కలిశారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన శ్రీశైలంగౌడ్ వర్గీకరణ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పెద్దల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఉపకులాల నాయకులు చింతల రాజలింగం, శ్రీనివాస్‌మాదిగ, యాదగిరిమాదిగ, మహేష్ మాదిగ, నర్సయ్య, సెపూర్‌కుమార్, కిరణ్‌కుమార్, మల్లీశ్వరి, జ్యోతి, రాణి తదితరులు ఉన్నారు.


## ఫైర్‌సేఫ్టీ మాక్‌డ్రిల్



ఆస్పత్రిలో ఆవరణలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న జీడిమెట్ల ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: సూరారంలోని మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం జీడిమెట్ల ఫైర్ సిబ్బంది ఫైర్‌సేఫ్టీపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఏదైనా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే మంటలను ఎలా ఆర్పాలన్న దానిపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ అధికారి సుభాష్‌రెడ్డి తగు సూచనలు చేశారు. ఆస్పత్రిలో ఎల్లప్పుడు అగ్ని ప్రమాద నివారణ కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

### నన్ను కాల్చేయ్.. లెగుస్తా.!



ఓవైపు పచ్చదనం కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుంటే.. మరోవైపు కొంతమంది నిర్లక్ష్యంతో ఆహ్లాదాన్ని పంచే వృక్షాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయని అనడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ నుంచి ఒక్షిత్ ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డులో శుక్రవారం చెట్టు మొదట్లో చెత్తను తగలబెట్టారు. ఎవరైనా స్థానికుల, పారిశుద్ధ్య కార్మికులా ఈ చెత్తను తగలబెట్టింది తెలియ రాలేదు. – సుభాష్‌నగర్

## ఖాళీ ప్రదేశాలు.. భవన వ్యర్థాలకు అడ్డాలు



నందానగర్ నుంచి ఎర్రగోడలకు వెళ్లే రోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు

రంగారెడినగర్: ఖాళీ ప్రదేశాలు, రోడ్డు పక్కల ప్రాంతాలు భవనాల వ్యర్థాలకు డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి.. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో డంపింగ్ స్పాట్లను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. భవనాల కూల్చివేతల నేపథ్యంలో వెలువడే డెబ్రిస్‌ను మెట్‌కానిగూడ సమీపంలోని రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డెబ్రిస్ రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించాల్సి ఉంటుంది. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న విషయం కావడంతో పలువురు భవన యజమానులు రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్లు, లారీల్లో తీసుకువచ్చి డంప్ చేస్తున్నారు. వీటిపై జీహెచ్ఎంసీ అధికారుల నిఘా లోపించడంతో గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో ఇష్టానుసారంగా డెబ్రిస్ డంపింగ్ కొనసాగుతోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్ నుంచి ఎర్రగోడలకు వచ్చే ఏంటీఏఆర్ వెనుక గల్లీలో రోడ్డు వెంబడి, పంచశీల కాలనీకి అనుకుని ఉన్న ఐడీపీఎల్ ఖాళీ రోడ్డులో డెబ్రిస్‌ను గుట్టలుగా డంప్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ అక్రమ డెబ్రిస్ డంపింగ్‌పై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### ఓపెన్ జిమ్ పనులకు భూమిపూజ



కేటీఆర్‌కాలనీ పార్కులో భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రవికిరణ్

నిజాంపేట్: మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ముందుకు సాగుతున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 11వ వార్డు కార్పొరేటర్ వాకలపూడి రవికిరణ్ అన్నారు. కేటీఆర్ కాలనీలోని రోడ్డు నం.1లో నూతనంగా చేపడుతున్న పార్కులో శుక్రవారం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ... పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ రంగరాయ ప్రసాద్, బీసీసెల్ కార్యదర్శి శేషగిరి, కాలనీ అధ్యక్షుడు రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు బక్క మల్లేష్, సుధీర్‌వర్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఆధార్‌కార్డు అప్డేట్‌కు మంచి స్పందన

సుభాష్‌నగర్: ఎస్ఎస్‌పీఓఎస్ ఎస్సీ సికింద్రాబాద్ పోస్టల్ శాఖ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆధార్‌కార్డు అప్డేట్‌కు మంచి స్పందన లభించింది. శుక్రవారం బేగంపేట్ పీఆర్ ఇన్‌స్పెక్టర్, జేబీబీ రామారావు నేతృత్వంలో కొత్త ఆధార్ 22, సుకన్య పథకానికి 18, ప్రమాద బీమాకు 7 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు నాగేష్, ఆపరేటర్ మోహన్ బాబు, పోస్ట్‌మెన్ శంకర్, చిన్న, కవితలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే వివేకానంద్



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: జంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని ఐడీపీఎల్, సుచిత్ర, కుత్బుల్లాపూర్ జంక్షన్, కృష్ణకుంజ్, షాపూర్‌నగర్, సూరారం జంక్షన్ల అభివృద్ధి పనులు, జంట సర్కిళ్ల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాల విషయమై శుక్రవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ట్రాఫిక్ రహిత రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జంక్షన్లను నిర్మిస్తున్నమని అన్నారు. అధికారులు సమన్వయం చేసుకుంటూ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

- అదే విధంగా జీహెచ్ఎంసీ జంట సర్కిళ్ల పరిధిలోని 8 డివిజన్లలో సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.10.50 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో వాటి పనులను పారంభించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో రూ.2 కోట్లతో చేపడుతున్న హిందూ శ్మశానవాటిక ప్రహరీ, కుత్బుల్లాపూర్ గ్రామం మీదుగా రోడ్డు వెడల్పు పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈలు కృష్ణ చైతన్య, గోవర్ధన్, డీఈఈలు రూపాదేవి, పాపమ్మ, భానుచందర్, ఏఈలు సంపత్, సురేందర్‌నాయక్, మల్లారెడ్డి, కన్సల్టెంట్ పూజిత పాల్గొన్నారు.

## దాహార్తిని తీర్చడానికే మిషన్ భగీరథ

దుండిగల్: రాష్ట్ర ప్రజల దాహార్తిని తీర్చడానికే తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టిందని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శుక్రవారం మల్లంపేట్ 26వ వార్డులో రూ.45 లక్షలతో చేపడుతున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోని ప్రతి ఇంటికి తాగునీటిని అందించే దిశగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాదాసు వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు ప్రేమకుమార్, మల్లేష్, రవి, రమేష్, విజయ్, హరీష్ తదితరులు ఉన్నారు.

# చిత్తారమ్మ జాతర ఆరంభం

- దేదీప్యమానంగా ఆలయ పరిసరాలు
- 8రోజుల పాటు కొనసాగనున్న జాతర



చిత్తారమ్మకు బోనం తీసుకువస్తున్న భక్తులు







ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, పంచగవ్య ప్రాసన పూజలు చేస్తున్న వేద పండితులు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మదేవి జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈనెల 27 వరకు 8 రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరలో మొదటి రోజు ఉదయం గణపతి పూజ, పుణ్యా వచనం, పంచగవ్య ప్రాసన, దీక్షధారణ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన జరిగింది. ఉదయం నుంచే చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాల సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

**మొదలైన సందడి..**

ఎనిమిది రోజుల పాటు జరగనున్న ఈ జాతరకు మొదటి రోజు నుంచి సందడి ఉంది. చిన్న పెద్దా తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**వెలసిన షాపులు...**

ఆలయానికి ఇరువైపుల 300 మీటర్ల వరకు షాపులు వెలిశాయి. చిన్నపిల్లలు ఆడుకోవడానికి రంగుల రట్నం, స్టాళ్లు, తినుభండారాలు, ఇతర షాపులు నెలకొల్పారు. జాతరకు వచ్చే మధ్య, పేద తరగతి భక్తులు పెద్ద సంఖ్యలో షాపింగ్ చేస్తారు. దీంతో ప్రతిఏటా లక్షలలో వ్యాపారం నడుస్తుంది.

**ప్రసాదాల కౌంటర్...**

అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రసాదం కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. వడ రూ.15, పులిహోర రూ.15, లడ్డు రూ.20 ధరగా ఆలయ కమిటీ నిర్ణయించింది.

**ఏర్పాట్లు పూర్తి..**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులు మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించాలి. జాతరలో ఎలాంటి సమస్యలు తలెత్తిన ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆఫీసులో ఫిర్యాదు చేయవచ్చు. – అంతయ్యగౌడ్, ఆలయ చైర్మన్